## కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం

హిమాయత్‌నగర్,నవంబర్16: రాష్ట్రంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని కార్మిక వర్గంపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తూ కార్మిక తిరోగమన విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. కార్మికుల త్యాగాలు,పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి వేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను సవరించిన కేంద్ర ప్రభుత్వంపై బలమైన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఉచిత వైద్య శిబిరం




వైద్య పరీక్షల అనంతరం మందులను అందజేస్తున్న ఫకీరయ్య యాదవ్, కుమార్ తదితరులు

ఖైరతాబాద్, నవంబర్ 16 : కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్, జనహిత సేవాట్రస్ట్, శివశక్తి ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని మహాభారత్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 215 మందికి బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ ఫిజిషియన్, పీడియాట్రిక్స్ వైద్యులు రోగులను పరీక్షించారు. భాతర్ వికాస్ పరిషత్ ద్వారా 75 మంది మహిళలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహాభారత్‌నగర్, బీజేఆర్ నగర్ బస్తీల అధ్యక్షులు ఫకీరయ్య యాదవ్, బి.కుమార్ మాదిగ, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు నర్సింహామూర్తి, శివశక్తి ఫౌండేషన్ ప్రతినిధి కల్యాణ్ కుమార్, భారత్ వికాస్ పరిషత్ కన్వీనర్ సదాశివ రెడ్డి, మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్ బి. నర్సింగ్ రావు పాల్గొన్నారు.

# అధికారులూ..!! ఈ బడి ఉన్నదా లేదా.!




## బస్తీబడి కష్టాలు తీరేదెన్నడో..

బీజేఆర్‌నగర్‌లో మూతబడ్డ సర్కారీబడి
ఇబ్బందులు పడుతున్న స్థానిక విద్యార్థులు
కళ్లముందు సమస్య కనిపిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం



బంజారాహిల్స్,నవంబర్ 16: అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కల్పిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నీటిమూటలుగా మారాయి.

- షేక్‌పేట మండల పరిధిలోకి వచ్చే ఫిలింనగర్ బీజేఆర్‌నగర్ బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మురుగునీటితో నిండిపోవడంతో పాటు భూమిలోకి కుంగిపోవడంతో మూతపడింది. ఇక్కడి విద్యార్థులను సమీపంలోని ఇతర పాఠశాలల్లోకి చేర్చిన విద్యాశాఖ అధికారులు పాఠశాల నిర్మాణాన్ని గాలికొదిలేశారు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పాటు స్థానికుల మధ్య విభేదాల కారణంగా ప్రభుత్వ పాఠశాల నిర్మాణ అంశం రెండడుగులు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది.
- గతంలో బీజేఆర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో సుమారు 300మందికి పైగా విద్యార్థులు చదువుకునేవారు. అయితే ఈ పాఠశాల నిరుపయోగంగా మారడంతో ఇక్కడి విద్యార్థుల్లో కొంతమంది సమీపంలోని మహాత్మాగాంధీనగర్ బస్తీలోని ప్రాథమిక పాఠశాలలో చేరగా మరికొంతమంది ప్రైవేటు స్కూళ్లలో చేరిపోయారు. ప్రైవేటు స్కూళ్ల ఫీజులు కట్టుకోలేని పలువురు విద్యార్థులు చదువు మానేసి అల్లరి చిల్లరగా తిరుగుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పేదలు నివాసం ఉంటున్న బీజేఆర్ నగర్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాలను కూల్చేసి కొత్త స్కూల్ నిర్మాణం కోసం గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బడి బాట పథకం కింద నిధులు మంజూరు చేశారు. అయితే ఎన్నికలు రావడంతో ఆ పనులు ప్రారంభం కాలేదు.
- కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరినా ఇప్పటివరకు స్కూల్ అభివృద్ధి విషయాన్ని గురించి పట్టించుకోవడం లేదని స్థానిక బస్తీనేత నడిమింటి కృష్ణ ఆరోపించారు.
- ప్రభుత్వాలు మారినా తమ బస్తీలోని ప్రభుత్వ పాఠశాల పరిస్థితి మాత్రం మారడం లేదన్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్‌తో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించి బీజేఆర్ నగర్ బస్తీ ప్రభుత్వ పాఠశాల పరిస్థితిని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న నార్సింగి మున్సిపాలిటీ ఖానాపూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ కన్నయ్యగారి వెంకటేష్‌యాదవ్

## బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న ఖానాపూర్ గ్రామ నాయకుడు మర్కంటి విఠల్‌రెడ్డి తదితరులు

### ప్రజాసమస్యల పరిష్కారం కోసం

## నిరంతరం పాటుపడతాం

### –బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత షేక్ ఆరీఫ్



మణికొండ, నవంబర్ 16 : మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీలో చేరిన నూతన నాయకత్వాన్ని కలుపుకుని ప్రజాసమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగుతామని బీఆర్ఎస్ నేత షేక్ ఆరీఫ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్యాద్రి నాయుడు, భాస్కర్‌గౌడ్, నిజాముద్దీన్, నవాజ్, అమీర్, వెంకటేష్ తదితరులందరితో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆయన పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ప్రజాసమస్యల పరిష్కారానికై కృషిచేస్తామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఐక్యమత్యంగా ఉంటూ పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడుతామన్నారు. పార్టీ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ అధ్యక్షతన, నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి , పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

### ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ..

## వ్యాపారం చేస్తే కఠిన చర్యలు



అత్తాపూర్‌లో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన పండ్ల వ్యాపారితో మాట్లాడుతున్న అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్రాంరెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 16: ప్రజల సౌకర్యార్థం కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్రాంరెడ్డి, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్‌గౌడ్‌లు అన్నారు. శనివారం లా అండ్ ఆర్డర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి హైదర్‌గూడ సర్ధార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తా నుంచి నంది ముస్లాయిగూడ చౌరస్తా వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించారు. అనంతరం వారు మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా పాదచారుల అవసరాల నిమిత్తం ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొందరు ఈ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. నడిచేందుకు దారి లేక పాదచారులు ప్రధాన రహదారులపై వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంటనే వ్యాపార సముదాయాలను తీసి వేయాలన్నారు. లేని పక్షంలో తామే వీటిని నేలమట్టం చేస్తామని స్పష్టం చేశారు.



## రోడ్ల నిర్మాణం నాణ్యతతో చేపట్టాలి

పది కాలాలపాటు ప్రజలకు ఉపయోగపడేలా రోడ్ల నిర్మాణం నాణ్యతతో చేపట్టాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్,నవంబర్16

## ముస్లిం శ్మశానవాటిక పనులు వేగవంతం

గోల్నాక : ముస్లిం శ్మశాన వాటిక పనులను వేగవంతం చేశామని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ తెలిపారు. అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా నుంచి నాగోల్ వెళ్లే కొత్త రహదారిలో ఏర్పాటు చేస్తున్న ముస్లిం శ్మశాన వాటిక పనులను శనివారం స్థానిక ముస్లిం నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. ఇప్పటికే శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం పూర్తయ్యిందని, మౌలిక సదుపాయాలు కల్పించి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.





### రోజుకు 2500మంది

## స్వాములకు అన్నదానం

శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో కొలువైన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజా మహోత్సవాలు శనివారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ మహా గణపతి హోమం, పంచామృత అభిషేకం, మహా హారతి, పడిపూజ, భజన, హరివరాసనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ మణికంఠ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో రోజుకు 2500మంది అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు సి.మురళీధర్, ఉపాధ్యక్షుడు సూరపనేని సునంద్, ప్రధాన కార్యదర్శి బి.రామచంద్రారెడ్డి, వి.రవిచంద్ర, సుబ్బారావు తదితరుల చేతులమీదుగా ప్రారంభించారు. సువర్ణభూమి సంస్థ తరపున 45రోజుల అవసరమయ్యే బియ్యాన్ని విరాళంగా అందజేస్తున్నారని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస శర్మ, హెటిరో డ్రగ్స్ చైర్మన్ పార్థసారధి రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.
– బంజారాహిల్స్,నవంబర్ 16

## పద్మశాలి సంఘం అభివృద్ధికి తోడ్పడాలి

### రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా మచ్చ సుధాకర్ ఎన్నిక



మైలార్‌దేవ్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 16: పద్మశాలి సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మచ్చ సుధాకర్ అన్నారు. జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ భవన రుషీనగర్ శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ భవనంలో జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సంఘం ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మచ్చ సుధాకర్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే యువజన, చేనేత, మహిళా, న్యాయవాదులు, ఇతర విభాగాలకు కూడా ప్రతినిధులను ఎన్నుకొని ప్ర మాణస్వీకారాలు చేపట్టారు. వేముల వెంకన్న, ఏర్వ సత్యానారాయణ, కాశిగారి యాదగిరి, కోట జనార్థన్, చిప్ప లక్ష్మి, నర్సింహామూర్తిలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అనం తరం నూతన సభ్యులకు నియామకపత్రాన్ని అందజేసి శాలువాలతో సత్కరించారు. సంఘం అధ్యక్షులు మచ్చ సుధాకర్ మాట్లాడుతూ పద్మశాలి సంఘం పట్ల నాయకత్వం చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు సైకిళ్లు అందజేత



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డి

జూబ్లీహిల్స్,నవంబర్16: ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి అవసరమైన సహకారం అందిస్తున్నామని రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డి పేర్కొన్నారు. శనివారం బొమ్మల రామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో రొటేరియన్ సెక్రటరీ వెంకట్‌తో కలిసి విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వరలక్ష్మి, ఎంఈఓ రోజారాణి, మహేష్, సుహాసిని, విజయభారతి, జగన్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, 16: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు కాటేదాన్ విద్యుత్ సెక్షన్ అసిస్టెట్ ఇంజినీర్ ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు కాటేదాన్ పారిశ్రామికవాడ, సాయిబాబానగర్, గంగోత్రి విద్యుత్ ఫీడర్ పారిశ్రామిక ప్రాంతం, గణేష్‌నగదర్, అమ్మ గార్డెన్, పయోనీర్ స్కూల్, బాబా టెంట్ హస్, షమ టెంట్‌హౌస్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాటేదాన్ పారిశ్రామికవాడ నేతాజీనగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోతలు విధిస్తున్నామన్నారు.

**గగన్‌పహాడ్ విద్యుత్ సెక్షన్‌లో...**

గగన్‌పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని రవిపుడ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పారిశ్రామికవాడ, రామ్‌చరణ్ ఆయిల్ మిల్ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలన్నారు.

**జూబ్లీహిల్స్ పరిధిలో..**

జూబ్లీహిల్స్: విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల కారణంగా ఆదివారం వివిధ 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ గోపి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కాలనీ సబ్‌స్టేషన్ కళింగ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 10: 30 గంటల వరకు.. కమాండ్ కంట్రోల్ సబ్ స్టేషన్ వేమిరెడ్డి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:45 వరకు.. గ్రీన్ బంజారా కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు.. రోడ్డు నంబర్–12 సబ్‌స్టేషన్ కనకదుర్గ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 నుంచి 3 గంటల వరకు.. ఎన్బీటీ నగర్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

# అప్పుడు వాళ్లే....ఇప్పుడూ వాళ్లేనా

- ఇక పార్టీ జెండా పట్టిన మేమెందుకు?: పాత నేతలు
- నేడు నామినేటెడ్ పదవులు.. రేపు పార్టీ టిక్కెట్లు వాళ్లకే..!
- కుల రాజకీయాలకు తెర లేపుతున్నారు: క్షేత్రస్థాయిలో రగడ
- కొంత మంది నేతల పెత్తనంపై సర్వత్రా ఆగ్రహం
- నియోజకవర్గ 'హస్తం' పార్టీలో గందరగోళం




మణికొండ, నవంబర్ 16: రాజకీయాల్లో శాశ్వత శత్రువులు...శాశ్వత మిత్రులుండబోరంటూ ఆనవాయితీగా వాడుకలోవస్తున్న పదం అది నిజమే...కానీ ప్రస్తుత రాజకీయాల్లో అంతకుమించి పార్టీ మారితే పదవులు పక్కా...జెండాపట్టి పనిచేస్తే ఆశించిన ఆ పదవులకు బొక్క అన్నట్లుగా తయారైయింది రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని రాజకీయాలు. దశాబ్దకాలంగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌పార్టీలో కేటాయించిన నామినేటెడ్ పదవుల్లో వారే...ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత కూడా వారే..అప్పుడు వాళ్లే, ఇప్పుడు వాళ్లే మేమంతా ఏమిటీ అన్న ప్రశ్నలు పాత కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల మదిలో ఉక్కిరిబిక్కిరౌతున్న పరిస్థితి ఇదీ. పదేళ్ల తర్వాత మా అందరికీ మంచిరోజులొచ్చాయని ఆశించిన పాతకాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ప్రస్తుతం దిక్కుతోచని పరిస్థితులు నెలకొన్నాయనే చెప్పాలి.

**అప్పుడు వాళ్లే...ఇప్పుడు వాళ్లే మనమంతా ఎందుకు**

వారంరోజులుగా కాంగ్రెస్ పార్టీలో గుసగుసలు మొదలైయ్యాయి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్ని పార్టీల నాయకులను దగ్గరకు పిలిచి సమన్యాయం చేస్తాడనుకుంటే ఆయన కేవలం తన దగ్గరి అనుచరులకు మాత్రమే పదవులను కట్టబెట్టేందుకు పావులు కదపడంతో అంతా గందరగోళంగా మారిపోయిందని కొంతమంది నాయకులు మండిపడుతున్నారు.

ఇక పాత కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది సీనియర్ నాయకులు సైతం తమ దగ్గరి అనుచరులకే ప్రాధాన్యత కల్పించుకుని స్వార్థతను చూపుకున్నారని విస్మయం వ్యక్తంచేస్తున్నారు. పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న సామాన్య కార్యకర్తలకు న్యాయం కాంగ్రెస్ పార్టీలో సాధ్యం కాదంటూ అంతర్గతంగా చర్చలు సాగుతున్నాయి.

ఒకే సామాజిక వర్గానికి చెందిన కొంతమంది నాయకులు అంతర్గతంగా ఆడుతున్న రాజకీయ క్రీడలో పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న వారికి అన్యాయం జరుగుతుందని ఇప్పటికే గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల నుంచి క్షేత్రస్థాయి నాయకులు బహిరంగంగానే ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

**● ఎమ్మెల్యేను చుట్టేస్తున్న రాజకీయం**

ఇన్నాళ్లుగా బీఆర్ఎస్ పార్టీలో ఉన్న రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేప్రకాష్‌గౌడ్ అన్నివర్గాల ప్రజలను కలుపుకుని ముందుకు వెళ్తారనుకుంటే ఏకపక్షంగానే తమ వెంట పార్టీ మారిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇటీవల కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న తర్వాత ఆ పార్టీలో ముసలం మొదలైయింది.

**● మొదలైన వలసల పరంపర**

నియోజకవర్గ పరిధిలోని మణికొండ మున్సిపాలిటీకి చెందిన వందలాది మంది కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు శనివారం బీఆర్ఎస్ పార్టీలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో వలసల పరంపర ఊపందుకుంటుంది. మరో రెండు మాసాల్లో మున్సిపాలిటీల పదవీకాలం ముగిసిన తర్వాత వేలాది మంది ప్రజాప్రతినిధులు, నాయకులు గులాబీ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

## ప్రభుత్వ తప్పిదాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బండ్లగూడ, నవంబర్ 16: రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మాజీ మంత్రి కేటీఆర్ బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రావులకోళ్ల నాగరాజు రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు నాగరాజు తెలిపారు.



మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రావుకోళ్ల నాగరాజు తదితరులు

## 'గాండ్ల తెలికుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి'

ఖైరతాబాద్, నవంబర్ 16 : గాండ్ల తెలికుల సామాజికవర్గానికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిక్కుమళ్ల రాంచందర్ రావు కోరారు. ఖైరతాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాండ్ల తెలికులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రెడ్డిగాండ్ల సామాజికవర్గానికి కొందరు అధికారులు గాండ్ల కుల ధృవీకరణ పత్రాలు ఇస్తున్నారని, వారితో తమ సామాజికవర్గానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. వారికి ధృవీకరణ పత్రాలు ఇస్తే అది చట్టవిరుద్ధమవుతుందన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కూతురు లక్ష్మణ్, కోశాధికారి వేల్పుల మల్లికార్జున్ రావు, రాష్ట్ర నాయకులు ఎన్. సుధాకర్, సత్యనారాయణ, వై. మధుకర్, కృష్ణవేణి, వెన్నెల, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వివిధ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత 10వ తరగతి అని తెలిపారు. రెస్పిరేటరీ థెరపీ, ఈసీజీ, మెడికల్ ల్యాబ్, కార్డియాలజీ టెక్నీషియన్స్, రేడియోగ్రఫీ అసిస్టెంట్ వంటి పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు కోర్సుల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు.

## మూసీ బాధితులకు అండగా ఉంటాం



అత్తాపూర్‌లో మూసీ బాధితులతో మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 16: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు బీజేపీ ముందుండి పోరాడుతుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అత్తాపూర్, హైదర్‌గూడ మూసీ పరీవాహక బాధితుల కోసం ఒక రోజు నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ పరిసర ప్రాంతాల్లో బాధితుల ఇంటికెళ్లి భరోసా కల్పిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు పక్కనపెట్టి రేవంత్‌రెడ్డి చేస్తున్న నీతిమాలిన వ్యాఖ్యలు మీరు వెళ్లి అక్కడ మూసీ ప్రాంతంలో నిద్ర చేసి రండి అని చెప్పడం దానికి దీటుగా ప్రజలకు భరోసా కల్పిస్తూ బీజేపీ నాయకులంతా కలిసి పరిసర ప్రాంతాల్లో బస చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ కర్కశ పాలనలో పేదలకు గూడు–నీడా దూరమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జనార్ధాన్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, మోండ్ర కొమురయ్య, అంజన్‌కుమార్ తదితరులున్నారు.